క్లుప్తంగా

చేపల మృతిపై విచారణ



చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దౌలాపూర్ గ్రామశివారులోని పెద్ద చెరువులో చేపలు అనుమానాస్పదంగా మృతి చెందడం పై తహసీల్దార్ పర్వీన్ షేక్ విచారణ చేపట్టారు. గురువారం చెరువును తహసీల్దార్ పరిశీలించారు. చేపల మృతిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు. మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): బీఆర్ఎస్ కార్యకర్త మృతి చెందడంతో ప్రమాద బీమా కింద చెక్కు మంజూరయింది. నూరు మండలం సదులనగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చెక్కల ప్రభు కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయాడు. బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్నందున రెండు లక్షల రూపాయల చెక్కును మృతుడి భార్య రంగమ్మకు గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్ : చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. గురువారం జిల్లా కోర్టు కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంకు కేసులు రాజీమార్గంతో పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు



కాశీపూర్‌లోని క్రీడాప్రాంగణం

కంది(సంగారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆడుకునేందుకు గత ప్రభుత్వం గ్రామానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. ఆటలు ఆడుకునేందుకు పరికరాలను కూడా అమర్చారు. నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో క్రీడా ప్రాంగణాలు శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. పొదలు, ముళ్ల చెట్లు పెరగడంతో ఆటలు ఆడేందుకు పిల్లలు ముందుకు రావడంలేదు. దీంతో నామమాత్రంగా మిగిలాయి. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తేవాలని యువత కోరుతున్నారు.

ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామానికి చెందిన ఇస్మాయిల్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ. 2 లక్షల ఎల్ఓసీని మంజూరయింది. అనారోగ్యంతో బాధపడుతూ ఇస్మాయల్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి విన్నవించారు. ఈ మేరకు మంజూరయిన ఎల్ఓసీని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఇమ్రాన్, నాయకులు వినోద్ పాల్గొన్నారు.

జైలుకు పంపుతున్నా.. జంకడం లేదు

- రోజురోజుకు పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- నాలుగు నెలల్లో 1105 కేసులు.. 38 మందికి జైలు



మద్యం సేవించి వాహనాలు నడపొద్దని అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: మద్యం తాగి వాహనం నడిపితే ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు సైతం పంపుతున్నారు.. అలాగే కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. మరికొందరికి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తున్నారు. అయినా మందుబాబుల్లో మార్పు రావడం లేదు. ఫుల్‌గా తాగి వాహనాలు తీసుకొని రహదారుల పైకి వస్తున్నారు.

నాలుగు నెలల్లో 1105 కేసులు.. 38 మందికి జైలు

మందుబాబులు ఫుల్‌గా మద్యం తాగి.. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలు బారిన పడుతున్నారు. అంతేకాక ఇతరుల ప్రాణాలు కోల్పోవడానికి కారణవుతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే.. తీవ్ర పరిణామాలు, కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించినా పరిస్థితి మారడం లేదు. పోలీసులు నిరంతరం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి జరిమానాలు, జైలు శిక్షలు విధించినా.. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయినా మార్పు రావడం లేదు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పటాన్‌చెరు, ఇస్నాపూర్, ముత్తంగి రింగ్ రోడ్డు, ఇంద్రేశం సమీపంలోని సర్వీస్ రోడ్డు, అమీన్‌పూర్‌తో పాటు పలు చోట్ల ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు 1105 కేసులు నమోదు కాగా అందులో 38 మందికి జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

వాహన తనిఖీల్లో ఎస్ఐకి గాయాలు

ఇటీవల జిన్నారంలోని మండల పరిషత్తు కార్యాలయం సమీపంలో ఎస్ఐ నాగలక్ష్మి సిబ్బందితో కలిసి ఓ కారును తనిఖీ చేస్తుండగా కారులో మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసుల కళ్లుగప్పి పారిపోయేందుకు ప్రయత్నించగా ఎస్ఐ నాగలక్ష్మి అడ్డుకోవడంతో స్వల్ప గాయాలైన విషయం తెలిసిందే. చాలా వరకు వాహన తనిఖీలో మద్యం సేవించి వాహనం నడిపే వాహనదారులు పోలీసులను నుంచి తప్పించుకునేందుకు వాహనం ఆపినట్లు చేసి తప్పించుకొని వెళ్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడుతున్న వారిలో చాలా వరకు ద్విచక్రవాహనదారులే. కార్ల యాజమానుల విషయంలో గతంతో పోలిస్తే కొంత మార్పు వచ్చింది. డ్రైవర్‌ను నియమించుకోవడం వంటివి చేస్తున్నారు. పట్టుబడిన వాహన దారులను కోర్టులో హాజరుపర్చగా అక్కడ న్యాయమూర్తి జరిమానాతో పాటు జైలు శిక్షలు విధిస్తుంది. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపకూడదని అవగాహన కల్పిస్తున్నాం.

– డీఎస్పీ రవీందర్ రెడ్డి, పటాన్‌చెరు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఐకేపీ డీపీఎం కొమురయ్య



కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కొమరయ్య

హత్నూర (సంగారెడ్డి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా ఐకేపీ డీపీఎం కొమరయ్య అన్నారు. గురువారం హత్నూర మండలం గుండ్ల మాచునూర్, చందాపూర్, మంగాపూర్, దౌల్తాబాద్, దౌలాపూర్, దేవులపల్లి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎం కొమురయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం తూకం వేసి రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించారు. నువ్వులు కేంద్రాల వద్ద సమస్యలు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం దేవేందర్, నిర్వాహకులు ఉన్నారు.

సింగూరు ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతి



శవమై తేలిన దుర్గయ్య

పుల్‌కల్(అందోల్): ప్రమాదవశాత్తు సింగూరు ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సింగూర్ ప్రాజెక్టులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్ మండలం కిష్టయ్య గూడెంకు చెందిన కస్తూరి దుర్గయ్య (35), ఈ నెల 6న సింగూర్‌లో బంధువుల దగ్గరకు వచ్చాడు. ఈ క్రమంలో సింగూర్ ప్రాజెక్టును చూడడానికి అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లా డు. ఎంత సేపటికి రాకపోవడంతో చుట్టు పక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సింగూరు ప్రాజెక్టులో గురువారం తేలడంతో కుటుంబ సభ్యులు దుర్గయ్యగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి



తహసీల్దార్ సరస్వతీకి వినతిపత్రం ఇస్తున్న చింతాగోపాల్, నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధి ఈదుల వాగు సమీపంలోని సర్వే నంబర్ 590, బై1 బై2 బై1 అసైన్డ్ పట్టా కలిగియున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ అక్రమంగా షెడ్డు నిర్మించి అద్దెకు ఇస్తూ సోమ్ము చేసుకుంటున్నాడని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ ఆరోపించారు. సత్యనారాయణ పేరుపై ఉన్న అసైన్డ్ పట్టాను రద్దు చేసి, అక్రమ కట్టడం.. విద్యుత్ కనెక్షన్ తొలగించాలని గురువారం గోపాల్, బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ రాంరెడ్డి, తహసీల్దార్ సరస్వతీకి వినతిపత్రం అందజేశారు. అలాగే, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, మురళిగౌడ్, సత్యనారాయణ, వీరేశం, మాజీ కౌన్సిలర్లు వీరేశం, కలీల్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం కింద నర్సరీల్లో మొ క్కలు పెంచి సంరక్షించాలని ఎంపీడీఓ రమేష్‌బాబు పేర్కొ న్నారు. గురువారం కల్హేర్ నర్సరీలో మొక్క ల పెంపకం పనులను పరిశీలించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ పాల్గొన్నారు.

ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి : ప్రతి ఒక్క వ్యాపారస్తుడు ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అమతశ్రీ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో పవనసుత టిఫిన్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టిఫిన్ సెంటర్‌లో పలు పదార్థాలను పరిశీలించి కొన్నింటిని సేకరించారు. అలాగే హోటళ్లలో, దుకాణ సముదాయాలు వద్ద అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పళ్లను మక్కించే కార్బైడ్ వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఈఓ సంతోష కోరారు. గురువారం కల్హేర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టారు. పట్టా పాసుపుస్తకం-ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తుందని తెలిపారు.

బీరప్పస్వామి ఉత్సవాలు ప్రారంభం

జహీరాబాద్ టౌన్ : మండలంలోని రత్నాపూర్ గ్రామంలో గురువారం బీరప్పస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంద పోచమ్మదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉత్సవాలు ఈనెల 12వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్టాపూర్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సిర్గాపూర్ మండలం గోసాయిపల్లి గ్రామస్తులు ఆటోలో నాగధర్ వైపు నుంచి కృష్టాపూర్ వైపు వస్తున్నారు. ఎదురుగా వచ్చిన బైక్ ఆటో ఢీకొట్టడంతో ఆటోలో ఉన్నా గుండమ్మ, పర్వయ్య, తదితరులు గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రూ.1500 జరిమానా, మరో 14 మందికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ చేస్తున్న శశికుమార్

మునిపల్లి(అందోల్): చదువుతో పాటు క్రీడల్లో రాణించి మునిపల్లి మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మంతూర్ శశికుమార్ అన్నారు. గురువారం మాజీ సీఎం కేసీఆర్ పేరుపై టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు టీ షర్ట్‌సను పంపిణీ చేశారు. గెలుపోటములు సహజమేనని.. క్రీడాకారులంతా కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతిర్లింగ వార్షికోత్సవం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని ద్వాదర జ్యోతిర్లింగ ఆలయంలో వార్షికోత్సవ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయంపై శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలతో పాటు శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర దేవతా కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగ్రామ్ మహారాజ్, వీరధర్మజ స్వామి, సర్వేశ్వర అంబికా మహారాజ్‌లు ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, నారాగౌడ్, మురళి పంతులు, పెరుమాండ్లుగౌడ్, ప్రసాద్‌రెడ్డి, కిషోర్, రాజేశ్వరరావు, ఆలయ కమిటీ బాధ్యులు కొత్త ప్రభు, కందుకూరి రవీందర్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మెథడిస్ట్ జాతర



జాతరకు ముస్తాబైన మెథడిస్ట్ చర్చి

జహీరాబాద్: మండలంలోని అల్లీపూర్‌లోని గార్డెన్ నగర్‌లో ఉన్న మెథడిస్ట్ క్రైస్తవ ఉజ్జీవ సభల 95 జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9న రాత్రి 8 గంటల నుంచి జెండాల ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభమయవుతాయని పేర్కొన్నారు. 10న ఉ.10.30 గంటలకు దైవధ్యానం, మధ్యాహ్నం 2 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. సా. 4గంటలకు ఆటల పోటీలు, రాత్రి 8.30 గంటల నుంచి భజన పోటీలు జరగనున్నాయని తెలిపారు. 9.30 గంటలకు మాణిక్యంచే బుర్రకథ, 11.30గంటలకు చలనచిత్ర ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. 11న రాత్రి 10.30 గంటలకు దైవ ఆరాధన, దైవ సందేశం, రోగుల కోసం ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు. జాతరకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

భూలక్ష్మమ్మ ఆలయం ముస్తాబు



నారాయణఖేడ్: భూలక్ష్మమ్మ ఆలయం



నారాయణఖేడ్: ఆలయంలో కొలువైన అమ్మవారు

నారాయణఖేడ్: మండలంలోని తుర్కపల్లిలో ఈనెల 11, 12 తేదీల్లో భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతీ ఏడాది ఆలయంలో ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 11న భూలక్ష్మీదేవి, శివుడిపూజ, నైవేద్యాల సమర్పణ, బండ్లప్రదక్షణ, బోనాల ఊరేగింపు, భజన, కీర్తనలు, 12న పాచిబండ్ల ప్రదక్షణ, నిండుజాతర, కుస్తీపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి కామారెడ్డి జిల్లాలోని పిట్లం మండలం ధర్మారం గ్రామం నుంచి 20 ఎడ్ల బండ్లు, మనూరు మండలం ఎల్గొయి గ్రామం నుంచి 50 ఎడ్ల బండ్లతో పాటు చుట్టు పక్కల తండాలు, గ్రామాల నుంచి పదుల సంఖ్యలో ఎడ్ల బండ్లతో రానున్నాయి. ప్రతీ ఏడాది ఆలయంలో ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో జనాలు తరలిరానున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జాతర

పోతన్‌పల్లిలో గురువారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజలు, తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.

అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాల్సిందే..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలోని పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బతుకులు మారడం లేదని మండిపడ్డారు. ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వకపోతే ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు చెందిలా చేస్తామన్నారు. ప్రజాపాలన అంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క ప్రజా సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ అందాల పోటీలే ముఖ్యమైనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదలందరినీ కలుపుకొని రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు సీపీఎం జిలా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్యం, సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, ప్రవీణ్, నాగేశ్వర్‌రావు, కృష్ణ, అశోక్, రాజయ్య, శ్రీనివాస్, రమేష్ గౌడ్, సలీం, రాజేష్, మహేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్రమ‘శిక్ష’ణేది?

- సమయపాలన పాటించని కార్యదర్శులు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు



ఉదయం 11:47 గంటలకు కూడా తెరచుకోని నర్సాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామీణ ప్రజానీకానికి అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశించిన స్థానిక అధికారులు వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మండలంలోని పలు పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గురువారం మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామపంచాయతీలో సంబంధిత కార్యదర్శి ఉదయం 11:00 దాటినా కార్యాలయానికి రాకపోవడంతో ఆ కార్యాలయం తెరుచుకోలేదు. ప్రతీరోజు ఈ గ్రామ కార్యదర్శి సమయానికి రావడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీరి అస్తవ్యస్త సమయపాలనతో కింది స్థాయి సిబ్బందిలోనూ అలసత్వం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఈ గ్రామ పంచాయతీ కార్యాలయం అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. గ్రామంలో చాలాచోట్ల రోడ్డుకిరువైపులా చెత్తా చెదారం నిండిపోయింది. గత రెండు, మూడు నెలలుగా చెత్త సేకరణ కూడా చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా అందరికీ అందుబాటులో ఉండి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్వహించి మరీ ఉన్నతాధికారులు ఆదేశించినా మండలంలోని గ్రామ కార్యరదర్శులెవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న జొన్నల కొనుగోళ్లు



న్యాల్‌కల్‌లో రైతులు తెచ్చిన జొన్నలను తూకం వేస్తున్న అధికారులు

జహీరాబాద్: న్యాల్‌కల్ మండల పరిధిలోని స్థానిక పీఏసీఎస్‌లో జొన్నల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వాహనాల్లో జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 1,104 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. జొన్నలు క్వింటాల్‌కు రూ.3,371 చెల్లిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400